


# సమస్యలు - పరిష్కారాలు

## - డా.యండమూరి వీరేంద్రనాథ్



సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

## ముందు మాట

ఈ పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ధాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

**వెంకట్, శ్రీకాకుళం:**

**నేను దైవ సంబంధ ఆచారవ్యవహారాలకు వ్యతిరేకిని. మనిషి సంతోషంగా బతకాలంటే ఆత్మవిశ్వాసం, తార్కిక జ్ఞానం ముఖ్యమని నమ్ముతాను. ఎప్పుడూ గుళ్లూ గోపురాలకు వెళ్లను. ప్రస్తుతం ఓ అకాడెమీలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నాను. మంచిస్థాయికి వెళ్లగలననే నమ్మకం ఉంది. కానీ బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కలవాళ్లు 'దేవుడికి పూజలు చేయకపోవడం వల్ల నాకు మంచి జరగట్లేదు, సరైన ఉద్యోగం దొరకట్లేదు' అని చెప్తున్నారు. అలాంటప్పుడు నా ఆత్మవిశ్వాసం కాస్త దెబ్బతింటోంది. ఈ మధ్య ఒక తెలిసిన వ్యక్తి నా జాతకంలో ఏవో కొన్ని దోషాలున్నాయని భయపెట్టే ప్రయత్నం కూడా చేశారు. ఇలాంటి వ్యక్తుల్ని ఎదుర్కోవడం ఎలా?**


తండ్రీ కొడుకులిద్దరు ఒక గాడిదని అమ్మటానికి నడిపించుకుంటూ పట్నం తీసుకు వెళుతున్నారట. దారిన పోయే పెద్దమనిషి అది చూసి, "గాడిద ఉన్నది స్వారీ చెయ్యటానికి" అన్నాడట. ఆ మాటలు విని తండ్రి, కొడుకుని దానిపై ఎక్కించి నడవ సాగాడు. ఎదురుగా వస్తున్న మరో పెద్దాయన, "వయసులో పెద్దవాడు నడుస్తూంటే కుర్రాడు హాయిగా కూర్చున్నాడు. కలికాలం" అన్నడట.



కుర్రాణ్ణి దింపి తాను ఎక్కాడు తండ్రి. మరి కొంత దూరం నడిచాక వెనుక నుంచి వచ్చే అమ్మలక్కలు "చూసావటే, తాను దర్జాగా కూర్చుని పాపం కుర్రాణ్ణి నడిపిస్తున్నాడు పెద్దమనిషి" అని గుసగుసలాడుకున్నారట. అది చెవినబడి, వాడిని కూడా ముందు కూర్చో బెట్టుకున్నాడట తండ్రి. అంతలో ఒక పండితుడు ఎదురుబడి, "అమాయక జంతువుపై ఇద్దరు ఎక్కుతార్రా? వచ్చే జన్మలో గాడిదలై పుడతారు" అని శాపం పెట్టినట్టూ తిట్టాడట. దాంతో భయపడిన ఇద్దరూ, పాప పరిహారార్థం ఆ గాడిదని ఓ కర్రకి వేలాడదీసి, భుజాల మీద పెట్టుకుని నడవసాగారు. వంతెన మీది కొచ్చేసరికి క్రింద నీటిని చూసి బెదిరిన గాడిద, కాస్త కొట్టుకునేసరికి ముడులు లూజై, ఎడమ కాలితో వెనక నడుస్తూన్న తండ్రి మొహాన్ని ఫెడీల్మని కొట్టి, నీళ్లలోకి దూకి పారిపోయిందట.

ప్రతివాడూ చెప్పింది నమ్మితే ఏమి జరుగుతుందో వివరించే సూఫీ కథ ఇది.

మీకు తెలుసా? ఆడపిల్ల అరటి చెట్టుకి వ్రతం చేస్తే (దీన్ని రంభా వ్రతం అంటారు) మంచి మొగుడు వస్తాడని ఇప్పటికీ కొన్ని కుటుంబాల్లో నమ్ముతారు.




భిన్న దృవాలు ఎప్పుడూ ఒకటి కావు. మీ అభిప్రాయాలపట్ల మీకు నమ్మకం ఉన్నప్పుడు మీ బంధువులూ, స్నేహితులూ వాటిని అర్థం చేసుకోకపోతే మీకొచ్చే నష్టం ఏమిటి? అసలు ఆ చర్చలన్నీ ఎందుకు? ఎప్పుడైతే మీ జాతకం మరొకరికి చూపించారో వారు దాని పట్ల తమ అభిప్రాయాలు చెపుతూనే ఉంటారు. వాటిని నమ్మనప్పుడు దాని గురించి చర్చ ఎందుకు?

అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే... అవతలి వారి అభిప్రాయం కూడా వినండి. ఒక నిర్ణయం తీసుకోండి. తన నమ్మకాలు తప్పని తెలిసినప్పుడు వాటిని మార్చుకోనివాడు మూర్ఖుడు. మార్చుకునేవాడు జ్ఞాని.

చివరగా ఒక సలహా. అనవసరమైన చర్చల ద్వారా సమయం వృధా చేసుకోకండి. మీ ప్రొఫెషనల్ కోర్సుకి బాగా ప్రిపేరవండి. మీరు నమ్మిన సిద్ధాంతాలను బలపరిచేవారి గ్రూపులు ఫేస్‌బుక్‌లో కొన్ని ఉంటాయి. ఆ గ్రూపులలో ఉండటం వల్ల మీ అభిప్రాయాలపట్ల మీ నమ్మకం ఇంకా బలంగా పెరుగుతుంది.

దైవమూ, ఆచారమూ, గుళ్ళూగోపురాలూ, విగ్రహారాధన... వీటిపట్ల బలమైన అభిప్రాయాలున్నవారు/లేనివారు మరొక అలవాటు కూడా చేసుకోవాలి. తమ అభిప్రాయాలకి వ్యతిరేకమైన అభిప్రాయాలు ఉన్నవారితో చర్చించటం, వాదించటం తగ్గించాలి.

**రంగారావు, బంటుమిల్లి.**

**ఎందుకు మీరు తరుచు మీ పుస్తకాల్లో బుద్ధుడి గురించి ప్రస్తావిస్తారు?**

మత గ్రంథాలు మనం ఎలా ఆలోచించాలో నిర్దేశించి చెబుతాయి. ప్రాపంచిక దృక్పథాన్ని మనుషులపై రుద్దుతాయి. మతం కాని మతం బౌద్ధం. మనుషుల నడవడికకీ, బతుక్కీ సంబంధాన్ని విడమరచి మనం ఎలా నడుచుకోవాలో చెబుతుంది. మతం ఇహ జీవితాన్ని సుఖవంతం చేయటం కంటె, పర జీవితాన్ని సుఖ మయం జేయ సూచన ఇస్తుంది. బౌద్ధం ఈ జీవితాన్ని ఇప్పుడే, ఇక్కడే సుఖమయం చేయాలంటుంది.



చేసిన పాపలు పోవటానికి సులభమైన చిట్కాలు చెప్పే టీ.వీ ప్రవక్త ల్లాంటి వాడు కాదు బుద్ధుడు. కఠినమైన భవబంధాలు వదులుకోమంటాడు. రాజవంశంలో పుట్టి, ప్రజల పక్షం వహించి, 'మనిషి'ని కేంద్ర బిందువుగా చేసి, ఒక జీవన విధానాన్ని ప్రబోధించినవాడు బుద్ధుడు. చివరకంటా చేసిన అతని బోధనలే 'బౌద్ధం'. తనకు నచ్చిన విషయాలు ఎక్కడ ఉంటే దాన్ని అభిమానిస్తాడు మనిషి. దానికి నేను కూడా అతీతుడనేమీ కాదు. విగ్రహారాధనకు వ్యతిరేకి బుద్ధుడు. నాకు నచ్చిన మొట్టమొదటి విషయం అది. తమ నమ్మకాలు తమటా ఉంచుకోకుండా, పిల్లల్ని గుళ్ళకి, గుండ్లకీ బలి చెయ్యటం దారుణమని నా విశ్వాసం.

'మా మతమే గొప్పది' అంటూ ఒక మత ప్రవక్తలు సువార్తలు చెపుతారు. 'చివరకు మిగిలేది మా మతమే' అంటుంది మరొక మతం. 'మాదే అన్నిటికన్న పురాతనమైనది' అంటుంది మరో మతం. బుద్ధుడు అలా కాదు. "నాతో సహా, అందరూ నిన్ను ప్రభావితం చేయటానికి ప్రయత్నిస్తారు. అది నీ తర్కానికి, ఇంగిత జ్ఞానానికి, హేతువుకి సరిపోతేనే దాన్నినమ్మి ఆచరించు" అని బోధిస్తాడు.

కులం, వర్గం, సమాజం, తల్లిదండ్రులు, సౌకర్యాలు... అన్నిటినీ అతడు త్యజించిన తీరు అతని బోధనలకు గౌరవ హేతువు అయ్యింది. అతని నిస్వార్థం, తన బలహీనతలను జయించిన విధానం పరులకు పాఠం అయ్యింది. సర్వాన్ని త్యాగం చేసి, భిక్షాపాత్ర ఒక్కటే తన ఆస్తిగా భావించాడు. జీవిక కోసం మాత్రమే ఓ పూట ఓ ఇంటి వాకిలి తట్టడం ద్వారా, భిక్ష స్వీకృతిలో కూడా మహోన్నత విలువలను పాటించాడు. అంతటి కష్టతరమైన జీవితం గడుపుతూ, సమాజంలో ఉన్న దుఃఖ కారణాలను చూస్తూ ప్రత్యక్ష అనుభవంలోంచి తెలుసుకున్నాడు. తనలా అనుభవాలను సైద్ధాంతీకరించి బోధించిన విలక్షణ ప్రవక్త మరొకరు లేరు. 'తన' అనే ఆలోచనని దరిచేరనివ్వని 'యోగి' అతను. అందుకే అతడంటే ఇష్టం.

రవి[ప్రకాష్: యానం.

జైనిజం గురించి కాస్త చెప్పండి.

జైనిజం హిందూ మతంకన్నా పురాతనమైనదంటారు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి. చీమలకి కూడా అపకారం తలపెట్టని జైనులు, రాలిన నెమలీకలతో తయారుకాబడిన చీపిరికట్టతో (పిచి) ఊడ్చుకుంటూ ముందుకు నడుస్తారు. అహింస, అనేకాంతవాద(అన్ని మత సిద్ధాంతాలనీ విశాల దృక్కుతో ఒప్పుకోవటం), అపరిగ్రహ (ఏదీ నాది కాదు), అనే మూడు సిద్ధాంతాలపై ఏర్పడింది ఇది. మహాత్మా గాంధీ ఈ జైన సిద్ధాంతాన్ని ఎక్కువగా అభిమానించి, అనుసరించేవారని ప్రతీతి. హిందూ/బౌద్ధ మతాల తాకిడికి అది కాలక్రమేణా క్షీణించింది.

బ్రహ్మాజీ, బలభద్రపురం:

**నన్ను ఒక సభకి ఆహ్వానించిన నిర్వాహకులు, అక్కడికి వచ్చిన పీఠాధిపతిని పూలమాల, శాలువాతో సత్కరించాలని కోరారు. నేను ఆ పని చేయడానికి ఉపక్రమించగానే, సదరు పీఠాధిపతి శిష్యుడు అడ్డుకుని, "మీరు స్వామిని అంటుకోకుండా వాటిని చేతుల్లో పెట్టండి" అని అన్నారు. సాటి మనిషిని అంటుకోవడానికి కూడా ఇష్టపడని సదరు స్వామి, మనుషుల మధ్య తిరగడం ఎందుకు? ఏ అడవుల్లోనో ముక్కు మూసుకుని తపస్సు చేసుకోవచ్చు కదా? మరో స్వామి విషయానికి వద్దాం. ఆయన ప్రయాణిస్తున్న కారులో ఆయన శిష్యుడు కూడా పక్కన ఖాళీగా ఉన్న సీట్లో కూర్చోకూడదు. ముందు సీటు– వెనక సీటుకు మధ్య ఉన్న ఖాళీ స్థలంలో స్వామిగారి పాదాల చెంత కూర్చోవాలి. ఇలాంటి దృశ్యాలను చూసిన నాబోటివాళ్లకు సదరు స్వాములను గౌరవించాలని ఎందుకు అనిపిస్తుంది?**

"వాళ్ళు ఎక్కడ కూర్చుంటారనేది వాళ్ళ ఇష్టం. మీరెక్కడ కూర్చుంటారనేది మీ ఆత్మాభిమానానికీ, అవతలివారి పట్ల మీకుండే గౌరవానికీ సంబంధించిన విషయం. బాపుగారిని మొదటిసారి కలిసినప్పుడు ఆయన కుర్చీలో కూర్చుంటే కాళ్ళ దగ్గర కూర్చున్నాను. పక్కన ఉన్న పట్టాభిరాం 'అదేమిటి అక్కడ కూర్చున్నావ్' అని అడిగితే, "చిన్నప్పుడెప్పుడో చూసిన సంపూర్ణ రామాయణం దర్శకుడిగా ఆత్మీయతతో కూడిన భక్తిభావం. జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు తొలిసారి కనపడినప్పుడు కాళ్ళకి నమస్కారం చేసాను. తప్పేమిటి?" అన్నాను. ఇదొక వాదన. "ఇతరులని ప్రభావితం చెయ్యగల వ్యక్తులు తమ బోధనలతో, పాండిత్యంతో, లేదా హిప్నాటిక్ పవర్‌తో ఒక కొటరీని నిర్మించుకుంటారు. బలహీనులు అందులో చేరతారు" అనేది మరొక వాదన. మీకు, సమాజానికీ, ప్రజలకు నష్టం లేకుండా మీకు ఏది బావుంటే అది చెయ్యండి. అయితే కొంతమంది డబ్బులిచ్చి తమచుట్టూ భక్తుల కోటరీని ఏర్పర్చుకుంటారు. ఒకరిద్దరు బాబాలూ, స్వాములూ అలలలంటివారు నాకు తెలుసు. ఒక పద్యం గుర్తు పెట్టుకోండి ***"...కోతి బట్టి దెచ్చి కొత్త పుట్టము గట్టి, కొండముచ్చులెల్ల గొల్చునట్టు, నీతిహీనునొద్ద నిర్భాగ్యు లుందురు విశ్వదాభిరామ వినుర వేమ".***





సాహిత్యం

రవిచంద్ర, అనంతపురం:

**ఎక్కడో మీరు 'సమాజం అయిదోతనం కోల్పోయినప్పుడు అక్షరం ఐరావతం అవుతుంది' అని వ్రాశారు. అంటే ఏమిటి?**

ఈ మధ్య టీవీల్లో రెండు ప్రకటనలొచ్చాయి. మొదటి అడ్వర్‌టైజ్‌మెంట్‌లో ఒక తండ్రి తన పద్నాలుగేళ్ళ కూతురుని పిక్నిక్‌కి పంపిస్తాడు. బాడీగార్డ్‌ని కాపలాగా పంపుతాడు. బాడీగార్డ్‌ని ఆడుకోమని తన సెల్‌ఫోనిచ్చి, ఆ అమ్మాయి బాయ్‌ఫ్రెండ్‌తో టెంట్‌లోకి వెళ్ళి తెల్లారేవరకూ ఉండిపోతుంది. "సెల్‌ఫోన్ బ్యాటరీ లైఫ్ చాలాసేపు ఉంటుందని (రాత్రంతా)" చెప్పే అడ్వర్‌టైజ్‌మెంట్ ఇది.



మరో ప్రకటనలో ఒక అమ్మాయి బెడ్-రూంలో తన బోయ్-ఫ్రెండ్‌తో మంచం మీద పడుకొని ఉండగా తండ్రి బయట నుంచి బెల్ కొడతాడు. అబ్బాయి చప్పున తలుపు వెనకాల నక్కి దాక్కుంటాడు. అమ్మాయి తలుపు తీస్తూండగా, దాక్కున్న కుర్రవాడి చేతిలో ఫోన్ మ్రోగుతుంది. తండ్రి అటు చూస్తాడు. అమ్మాయి విపరీతంగా భయపడిపోతూ ఉంటుంది. అప్పుడు తండ్రి రియాక్షన్ కోపం కాదు. ఆశ్చర్యం. ఆనందం..! దానికి కారణం ఆ కుర్రవాడి చేతిలో ఉన్న సెల్‌ఫోన్..! దాన్ని చేతుల్లోకి తీసుకుని ధర కనుక్కుని "ఇంత అందమైన ఫోన్ అంత తక్కువ ధరకా?" అని అడుగుతాడు. ఈ ప్రకటన తాలూకు ఆలోచన వచ్చినందుకూ, అది సక్సెస్ అయినందుకూ రచయితా, దర్శకుడూ సంతోషంతో పార్టీ చేసుకొని ఉండొచ్చు. కానీ వాళ్ళ కూతురు ఇదే పరిస్థితిలో ఉంటే ఏం చేస్తారు? లేదా టీవీలో ఈ అడ్వర్‌టైజ్‌మెంట్ వస్తున్నప్పుడు కూతురి పక్కనే కూర్చుని మనస్ఫూర్తిగా సంతోషించగలరా?

ఒక సామాజిక అన్యాయం జరుగుతున్నప్పుడు కవి/రచయిత తన కలాన్ని కత్తి చేసుకుంటాడు. ఫలానా విషయం ఎందుకు కరెక్టుకాదో, ఏవిధంగా అది ప్రమాదకరమో చెపుతాడు.

ఒక సినిమాలో నిజాయితీ పరుడైన పోలీసు కమీషనరు కూతురు, పనీ పాటా లేని ఒక బేవార్సు హీరోని నిరాకరిస్తుంది. అతడు ఆమెని గట్టిగా దగ్గరకు లాక్కొని ముద్దు పెట్టుకుంటాడు. దాంతో ఆ అమ్మాయి అతడిని ప్రేమించడం మొదలు పెడుతుంది. సినిమా అంతా హీరో కమీషనర్ని ఫూల్ని చేస్తాడు. బాగా హిట్టయిన సినిమా ఇది. కానీ ఆ దర్శకుడి కూతుర్ని ఒక బజారు రౌడీ ఇలాగే చేస్తే, దానికి అతడి రియాక్షన్ ఎలా ఉంటుంది?



మీరు గమనించారా? సినిమాల్లో హీరో బద్ధకస్తుడు, గమ్యం లేనివాడు, తండ్రి మీద జోకులు వేసేవాడు... చివర్లో కాస్త మారితే, యూత్ సెల్ఫ్-ఐడెంటిఫికేషన్, కలల అమ్మకం వల్ల అటువంటి సినిమాలు హిట్టవుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లోనే అక్షరం ఐరావతం అయ్యి, మనసుల్ని కుళ్ళబొడిచి ప్రక్షాళనం చేస్తుంది. కనీసం కొందరినైనా మారుస్తుంది.

**పి. రాములు:**

**విమర్శకీ, అభిప్రాయానికీ తేడా ఏమిటి?**

ఒక కథ లేదా సినిమా బావోలేదు అని చెప్పటం అభిప్రాయం. ఎందుకు బావోలేదో చెప్పటం విమర్శ. మళ్ళీ అందులో రెండు రకాలు. సద్విమర్శ. కువిమర్శ. తన అభిప్రాయాలకి సరిపోకపోతే చేసేది కువిమర్శ. హేతుబద్ధంగా కారణాలు వివరిచేది సద్విమర్శ.

**కౌముది, పిఠాపురం:**

**వ్యాపార నవలలంటే ఏమిటి? మంచి నవలలకి వ్యాపార నవలలకి తేడా ఏమిటి? ఏ రకమైన రచేయితగా మిమ్మల్ని మీరు అంచనా వేస్తారు? మీరు ఫక్తు వ్యాపార రచయిత అనే వారికి మీ జవాబు?**

పాండిత్యానికీ పుస్తకాల అమ్మకానికీ సంబంధం లేదు. ఎక్కువమంది పాటకుల స్టాండర్డ్‌కి, టేస్ట్‌కీ దగ్గరగా వ్రాసేవాడి పుస్తకాలకి మార్కెట్ ఎక్కువ ఉంటుంది. పుస్తకాలు పలు రకాలు.

- కలకాలం కోట్లమందితో చదివించే రామాయణ భగవతాల్లాంటివి;
- లిమిటెడ్ కోటరీ పాఠకుల వల్ల దశాబ్దాల పాటూ బ్రతికే స్త్రీవాద, కమ్యూనిస్టు రచనలు;

- ఉప్పెనలా వచ్చి ఉద్రుతలూగించి కాలగర్భంలో కలిసిపోయే వ్యాపార నవలలు;
- కనీసం కొన్ని విలువలుండి చరిత్రలో కొంత కాలం నిలబడే కమర్షియల్ రచనలు.
- అసలు వచ్చినట్టే తెలియని అనామక విసర్జనలు.

చాలా మందికి తెలియని (కుహనా మేధావులు ఒప్పుకోని) విషయం ఏమిటంటే.... వ్యాపార నవలల్లో కూడా కొన్ని విలువలుంటాయని...! అలాంటి విలువలేమీ లేకుండా వ్రాసిన, కేవలం శృంగార పరమైన నవలల్ని; చౌకబారు భావోద్వేగాల మీద ఆడుకుంటూ చేసే రచనలని; వంటింటి కహానీలని చాలామంది చదవటం ఎప్పుడో మానేసారు. ఈ రోజు నవలల్ని పాఠకులు చదువుతూన్నారంటే, వారేమీ మూర్ఖులూ, అజ్ఞానులూ, చెవుల్లో పూవులు పెట్టుకున్నవారూ కాదు. నేనే కేటగిరీకి చెందుతానో మీరే నిర్ణయించుకోండి.

**(కొనసాగింపు వచ్చేనెల)**